
సాక్షి
బాపట్ల
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



బొడ్రాయికి ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: వరుస మరణాలతో హడలెత్తిపోతున్న తురకపాలెం గ్రామ ప్రజలు గ్రామంలోని బొడ్రాయికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 68,340 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 89,306 క్యూసెక్కులు వదులుతున్నారు.

తెనాలిలో రేషన్ షాపు సీజ్



తెనాలి రూరల్: తెనాలి సాలిపేటలో ఉన్న 39వ నంబర్ రేషన్ దుకాణాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ఫిర్యాదులు వాస్తవం అని తేలడంతో షాపు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఐ అండ్ పీఆర్ డీడీగా రమేష్



గుంటూరు వెస్ట్: జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ డెప్యూటీ డైరెక్టర్‌గా లోచర్ల రమేష్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల వరకు ఇక్కడ పనిచేసిన మొహమ్మద్ రఫీక్ గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి డీపీఆర్వో శ్యామ్‌కుమార్ ఆ బాధ్యతలు నిర్వహించారు. రమేష్ 1996 ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సహాయ పౌర సంబంధాల అధికారిగా ఎంపికై హైదరాబాద్, విశాఖపట్నం, పాడేరు, శ్రీకాకుళం, పార్వతిపురం తదితర ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.

ఉమ్మడి జిల్లాకు 2,660 మెట్రిక్ టన్నుల యూరియా



కొరిటెపాడు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఐపీఎల్ కంపెనీకి చెందిన 2,660 మెట్రిక్ టన్నుల యూరియా శుక్రవారం సరఫరా అయ్యింది. స్థానిక రెడ్డిపాలెం రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియాను గుంటూరు ఏడీఏ, రేక్ అధికారి ఎన్. మోహనరావు పరిశీలించారు. ఇందులో గుంటూరు జిల్లాకు 1200 మెట్రిక్ టన్నులు, పల్నాడు జిల్లాకు 760 మెట్రిక్ టన్నులు, బాపట్ల జిల్లాకు 700 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు ఏడీఏ మోహనరావు తెలిపారు. గుంటూరు జిల్లాకు వచ్చిన 1,200 మెట్రిక్ టన్నులలో మార్క్‌ఫెడ్‌కు 900 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్స్‌కు 300 మెట్రిక్ టన్నులు సరఫరా చేయనున్నట్లు ఏడీఏ వివరించారు.

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి భౌతికకాయం వితరణ



తెనాలి: అమ్మ ఐ ఆర్గాన్ అండ్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సహకారంతో మృతి చెందిన వ్యక్తి కళ్లు, భౌతికకాయాన్ని దానం చేసినట్టు సంస్థ తెనాలి కో–ఆర్డినేటర్ నందూరి నారాయణరావు తెలియజేశారు. గుంటూరుకు చెందిన 73 ఏళ్ల వయసు గల ప్రభుత్వ ఉద్యోగి కొత్తపల్లి హరిబాబు శుక్రవారం మృతి చెందారు. ఆయన భార్య అపర్ణరాణి, కుమార్తె బీకే దీప్తి సమ్మతితో హరిబాబు నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు, భౌతికాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం కాటూరి మెడికల్ కాలేజీకి అందజేసినట్టు నారాయణరావు తెలిపారు. ఈ సత్కార్యానికి సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం అభినందించారని వివరించారు.

పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. ఎంఎస్సీ బయోటెక్నాలజీలో 32 మందికి 32 మంది, ఎమ్మెస్సీ సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీలో 15 మందికి 12 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంఎస్సీ సైకాలజీలో 24 మందికి 21 మంది, ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్సెస్‌లో 24 మందికి 24 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రీవాల్యుయేషన్ కోసం ఈనెల 22వ తేదీలోగా ఒక్కొక్క పేపరుకు రూ.1860 చెల్లించి పరీక్షల కోఆర్డినేటర్‌కు దరఖాస్తులు అందేలా పంపాలని ఆలపాటి శివప్రసాదరావు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన ఘటన ఉప్పలపాడు గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం యేల్చూరు గ్రామానికి చెందిన విజయ్(21) పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం నరసరావుపేట నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లే క్రమంలో ఉప్పలపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ కిశోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వాస్తవాలు చెబుతోందనే 'సాక్షి'పై అక్రమ కేసులు



తెలుగు ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న సాక్షిపై కూటమి సర్కారు అక్కసు వెళ్లగక్కుతోంది. ప్రతిపక్ష నేతలను, ప్రజల పక్షాన మాట్లాడే సాక్షిని నోరు మూయించే ఉద్దేశంతో వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగా 'ఇస్ ద ప్రెస్ ఇన్ ద హ్యాండ్.. ఈజీ టు మ్యానుఫ్యాక్చర్ ద గ్రేట్ మాన్' అనే మాటలు చంద్రబాబు, లోకేష్ విషయంలో నిజమయ్యాయి. చంద్రబాబు పాలనలో చేసిందేమీ లేకపోయినా ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు చూపిస్తున్నారు. ప్రజలకు ఇవన్నీ సరికాదని చెబుతున్నందుకు సాక్షిపై అక్రమ కేసులు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం తప్పులు సరిచేసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటు. అక్రమ కేసులు, అరెస్టులు సాక్షిని ఏమీ చేయలేవు.

– మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ



మీడియా స్వేచ్ఛను హరించాలనుకోవడం సిగ్గుచేటు



ప్రశ్నించే హక్కు, తప్పొప్పులను వెలికితీసే హక్కు సమాజంలో మీడియాకు ఉంది. వారి హక్కులను, స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం సిగ్గుచేటు. సాక్షి దినపత్రిక ఎడిటర్‌తోపాటు పలువురు జర్నలిస్టులపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా కేసులు బనాయించి విచారణ పేరుతో పిలుస్తుండటం మంచిది కాదు. ఏమైనా లోపాలుంటే వివరణ ఇస్తే సరిపోతుంది, కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ రాజకీయాలు చేయడం వలన ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారో ఆలోచించుకోవాలి. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తున్న ఇలాంటి చర్యలను మానుకుంటే మంచిది.

– నందిగం సురేష్, మాజీ ఎంపీ, బాపట్ల

చందాల పేరిట దందా

- రూ. 9 కోట్లు ఖర్చవుతుందంటున్న అధికారులు
- రూ. 4 కోట్లు ఇస్తామన్న ప్రభుత్వం
- మిగిలింది చందాల రూపంలో వసూలు చేయాలని కూటమి సర్కార్ ఆదేశం
- రంగంలోకి దిగిన పచ్చనేతలు, అధికారులు
- వెనకేసుకోవడానికి మాస్టర్ ప్లాన్
- రూ. 10 కోట్ల వసూళ్లకు ప్రణాళిక
- రిసార్ట్స్, రైస్ మిల్లర్స్, రేషన్ డీలర్స్, రియల్టర్ల నుంచి భారీగా వసూళ్లు
- ఒక్కొక్క విభాగం నుంచి రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షల దాకా వసూలు

బీచ్ ఫెస్టివల్ పేరుతో వసూళ్ల పర్వం



సూర్యలంక బీచ్‌లో జనం కోలాహలం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల : అధికారమప్పగిస్తే సంపద సృష్టించి అందరికీ పంచుతానన్న చంద్రబాబు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి అయ్యాక సంపద సృష్టించడం మాని, విచిత్రంగా చందాలివ్వమంటూ యాచన కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చారు.తొలుత అమరావతి నిర్మాణానికి చందాల దందా మొదలు పెట్టారు. ఆ తర్వాత ప్రకటించిన అన్నా క్యాంటీన్లకు చందాలు ఇస్తే పేర్లు వేస్తామని బంపరాఫర్ కూడా ఇచ్చారు. తరువాత పీ–4 తెరపైకి తెచ్చారు. పేదలందరినీ ఉన్నోళ్లను చేస్తానన్నారు. పోనీ ఆ పథకమైనా సంపద సృష్టించి చేస్తారులే అని ఆశిస్తే దానికీ యాచనలే అజెండా ! డబ్బున్న వారికి పేద కుటుంబాలను దత్తత ఇచ్చి బాగు చేస్తానని చెప్పారు. అదైనా కొంత మెరుగులే అనుకుంటే.. ఇప్పుడు స్థితిమంతులు దొరకలేదంటూ ప్రభుత్వ ఉద్యోగులకే ఆ బాధ్యత అప్పగిస్తున్నారు. తమ వంతు ఎప్పుడొస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు.



సూర్యలంక బీచ్‌లో స్నానాలు (ఫైల్)

26,27,28 తేదీల్లో బీచ్ ఫెస్టివల్

ఇప్పుడు బాపట్ల సముద్ర తీరంలో బీచ్ ఫెస్టివల్ చేస్తున్నాం.. చందాలివ్వమంటూ కూటమి ప్రభుత్వం వసూళ్ల పర్వానికి తెరతీసింది. జిల్లాలోని బాపట్ల సూర్యలంక, చీరాల ప్రాంతంలోని ఓడరేవు, రామాపురం తీరంలో ఈనెల 26,27,28 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర పర్యాటక శాఖ, జిల్లా పరిపాలనా విభాగం కలిసి పండుగను చేయాలని ఆదేశించింది. పాట కచేరీలు, ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, బీచ్ కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో ఆటలతోపాటు లేజర్‌షోలు, ఫుడ్‌కోర్టులు నిర్వహించి బీచ్ ఫెస్టివల్‌ను హోరెత్తిస్తామని చెబుతోంది. సర్కార్ కీర్తిని ఏపీతో పాటు సముద్రం ఆవలవున్న శ్రీలంక వరకూ చాటుతామని ఆర్భాటంగా చెప్పింది.

నిధులు మంజూరులో మెలిక

బీచ్ పండుగను చూడొచ్చని జనం కూడా సంబరపడ్డారు. తీరా నిధులు మంజూరులో ప్రభుత్వం మెలిక పెట్టింది. రూ. 9 కోట్లు ఖర్చయ్యే ఫెస్టివల్‌కు రూ. 4 కోట్లు మాత్రమే ఇస్తామని చావుకబురు చల్లగా చెప్పింది. మిగిలిన రూ. 5 కోట్ల మొత్తాన్ని చందాలు బాది వసూలు చేసుకోవాలని సూచించింది.

బలవంతపు వసూలు

బీచ్ ఫెస్టివల్ పేరుతో జేబులు నింపుకోవచ్చని భావించిన ఈ ప్రాంతానికి చెందిన కొందరు పచ్చనేతలు, అధికారులు వెనువెంటనే రంగంలోకి దిగారు. రూ. 5 కోట్ల వసూళ్లకు ప్రణాళిక సిద్ధం చేశారు. రిసార్ట్‌లు, రైస్ మిల్లర్స్, బియ్యం వ్యాపారులు, మెడికల్ అసోసియేషన్, హోటల్స్, ఆక్వా, హేచరీస్, గోల్డ్ వ్యాపార వర్గాలకు రూ. 15 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకూ ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు. మెడికల్ అసోషియేషన్‌కు రూ. 15 లక్షలు, రిసార్ట్‌లకు రూ. 50 లక్షలు, రైస్‌మిల్లు, రేషన్ వ్యాపారుల అసోసియేషన్లకు రూ. 25 లక్షలు, రియల్టర్లకు రూ. 25 లక్షలు చొప్పున చందా వేసినట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా రూ.10 కోట్లకు పైనే వసూళ్లకు రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం ఉంది.

వ్యాపారుల మండిపాటు

బియ్యం, ఇసుక, బుసక, గ్రానైట్, గ్రావెల్ అమ్ముకుంటూ నెలకు రూ. కోట్లు గడిస్తున్న పచ్చనేతల నుంచి చందా వసూలు చేయకుండా వ్యాపారులను ఇబ్బంది పెట్టడంపై అన్ని వర్గాలు మండి పడుతున్నాయి. చిరు వ్యాపారులు కుయ్యో మొర్రో అన్నా పచ్చనేతలు, అధికారులు కనికరించడం లేదు. చందా వసూళ్ల కార్యక్రమాన్ని ఆపడం లేదు. స్పందించని వారిపై పైగా అధికారులు పచ్చ నేతలకు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో వారు రాసినంత ముట్టజెప్పాల్సి వస్తోంది.

అందరి నోళ్లుకొట్టి పండగ

తీరంలో బీచ్ ఫెస్టివల్ చేయడం మంచిదే. పర్యాటకులు, స్థానికులు ఆస్వాదిస్తారు కూడా. కానీ ప్రభుత్వ ఖర్చుతో చేయకుండా బలవంతపు వసూళ్లతో అందరి నోళ్లుకొట్టి పండుగలేమిటో ? అంటూ వ్యాపారుల అసోసియేషన్లు గొల్లుమంటున్నాయి. బీచ్ ఫెస్టివల్ పేరుతో నేరుగా డబ్బులు వసూళ్లు చేస్తే ఆరోపణలు వస్తాయన్న కొందరు అధికారుల సూచనలతో పచ్చ నేతలు రూటు మార్చారు. స్పాన్సర్ల పేరున వసూళ్లకు దిగుదామంటూ పథక రచన చేసినట్లు సమాచారం. ఇప్పటికే వసూళ్ల పర్వం మొదలైనట్లు తెలుస్తోంది.

అర్ధంతరంగా కలెక్టర్ బదిలీ

ఈ సమయంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి గురువారం సాయంత్రం అర్ధంతరంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వినోద్ కుమార్ కలెక్టర్‌గా వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26,27,28 తేదీల్లో బీచ్ ఫెస్టివల్ ప్రభుత్వం ఇచ్చిన రూ. 4 కోట్లుతో జరుగుతుందా? లేక రూ. 10 కోట్ల చందా వసూళ్ల ప్రణాళిక ప్రకారం నడిపిస్తారా? అనేది వేచి చూడాలి.

చిరు వ్యాపారులు బెంబేలు

పచ్చనేతలు, అధికారుల చందాలతో అన్ని వర్గాల వారు బెంబేలెత్తిపోతున్నారు. చిరు వ్యాపారుల అసోసియేషన్లను కూడా వదల్లేదు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తమపై ఈ భారం ఏమిటి బాబో అన్నా కనికరం చూపడం లేదని ఓ మెడికల్ షాపు దుకాణదారుడు 'సాక్షి'తో వాపోయారు. రూ. లక్షల్లో ఈ వసూళ్లు ఏమిటంటూ బాపట్లకు చెందిన రైస్ మిల్లు యజమాని లబోదిబోమన్నారు. చీరాల, బాపట్ల ప్రాంతాల్లోని అందరు వ్యాపారులు బీచ్ ఫెస్టివల్ చందాలు చూసి జడుసుకుంటున్నారు.

అద్దంకి సమన్వయకర్తగా డాక్టర్ అశోక్



సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్‌ను నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యుడైన అశోక్‌కుమార్ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడుకు చెందినవారు. పిడుగురాళ్లలో పల్నాడు హాస్పిటల్స్ అధినేతగా ఉన్నారు. 2024 ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీలో చేరారు. అప్పటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. సమన్వయకర్తగా తనను నియమించిన అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డిలకు అశోక్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

నేడు అంగన్‌వాడీల ద్వితీయ జిల్లా మహాసభ

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా అంగన్‌వాడీల ద్వితీయ మహాసభ శనివారం చీరాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.శైలశ్రీ తెలిపారు. బాపట్ల కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని తొమ్మిది ప్రాజెక్టుల్లో నాలుగు వేల మంది పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారన్నారు. తమ సమస్యలపై గత ఎన్నికలకు ముందుగా రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజులు పాటు సమ్మె చేసి అనేక జీవోలు సాధించుకున్నామని వివరించారు. ప్రధానంగా వేతనం పెంపు అలాగే ఉందని తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మహాసభలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొంటారని, జిల్లాలోని అంగన్‌వాడీలంతా పెద్దఎత్తున హాజరు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.సీతామహాలక్ష్మి, ఎన్. హేమ పాల్గొన్నారు.

బాపట్ల మెడికల్ కళాశాల పేదోడి ఆస్తి



మెడికల్ కళాశాల వద్ద నిరసన ప్రదర్శనలో మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, నేతలు

- మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి
- ఎంతో కష్టపడి ఉచితంగా స్థల సేకరణ
- ప్రైవేటు పరం చేస్తే సహించం

బాపట్ల: ''బాపట్ల మెడికల్ కళాశాల పేదోడి ఆస్తి.. ఎంతో కష్టపడి ఉచితంగా స్థల సేకరణ చేపట్టాం. రూ.82కోట్లు వరకు ఇప్పటికే ప్రభుత్వం ఖర్చు చేసింది.. ఇప్పుడు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చూస్తే ఊరుకునేదిలేదు''అంటూ మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ధ్వజమెత్తారు. బాపట్ల పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి నేతలతో ప్రదర్శనగా శుక్రవారం మెడికల్ కళాశాలకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మొదటి నుంచి విద్య, వైద్యాన్ని ప్రైవేటు పరం చేయాలనే తలంపుతోనే ఉన్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ మెడికల్ కళాశాలను అనుయాయులకు కట్టబెట్టేందుకు రంగం చేసినట్లు ఆరోపించారు. మహానేత డాక్టరు వైఎస్. రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరుతో పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందిస్తే, ఆయన తనయుడు వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఏకంగా రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. 17 కళాశాలలో ఇప్పటికే ఆరు, ఏడు చోట్ల ప్రారంభమైనట్లేనని తెలిపారు. సూపర్ సిక్స్ అంటూ డప్పాలు కొట్టుకునే చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్వహణ చేయలేమని చెప్పటం చూస్తుంటే ఆశ్చర్యంగా ఉందని రఘుపతి అన్నారు.

ఉచితంగా భూసేకరణ

బాపట్ల మెడికల్ కళాశాలకు స్థల సేకరణ చేపట్టేటప్పుడు ఎన్నో కష్టాలు పడ్డామని కోన చెప్పారు. సూర్యసత్యనారాయణరాజు నుంచి మొదట 25ఎకరాలు ఉచితంగా స్థల సేకరణ చేశామన్నారు. అనంతరం ఆ స్థలం అసైండ్ ల్యాండ్ అని తెలిసిన వెంటనే 56 ఎకరాలను ఉచితంగా సేకరించేందుకు సూర్యసత్యనారాయణరాజును ఒప్పించినట్లు వివరించారు. కళాశాల నిర్మాణానికి రూ.550 కోట్లతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు రాగా, ఈపాటికే రూ.82కోట్లు ఖర్చుపెట్టి పనులు చేపట్టామని చెప్పారు.

కళాశాల నిర్మించేందుకు ఉద్యమం

బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మించేందుకు ఉద్యమం చేపడతామని, ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతలు తీసుకునే విధంగా ఒత్తిడి పెంచుతామని కోన చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, నాయకులు కొక్కిలిగడ్డ చెంచయ్య, కోకి రాఘవరెడ్డి, గవిని కృష్ణమూర్తి, దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, మండే విజయ్‌కుమార్, ఇనగలూరి మాల్యాద్రి, గంగిశెట్టి రత్తయ్య, వడ్డిముక్కల డేవిడ్, చింతల రాజశేఖర్, నక్కా వీరారెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ అని బోర్డు పెట్టుకుంటే చర్యలు తప్పవు

- ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్సకు మించి వైద్యం చేయరాదు
- ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ డి శ్రీహరిరావు హెచ్చరిక



గ్రామంలో పర్యటిస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు వైద్యులు

గుంటూరు రూరల్: నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడైనా ఆర్‌ఎంపీలు, పీఎంపీలు డాక్టర్ అని బోర్డు పెట్టినా, అత్యవసర ప్రథమ చికిత్స తప్పా ఏ విధమైన వైద్యం చేసినా చట్టబద్ధ చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిశోర్‌తో కలసి తురకపాలెం గ్రామాన్ని సందర్శించారు. స్థానికంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి, వైద్యుల్ని నమోదవుతున్న కేసుల వివరాలు, అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, స్థానిక వైద్యాధికారులు వివరించారు. అనంతరం గ్రామంలో పలు వీధులను పరిశీలించిన ఆయన ఏపీ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారి డాక్టర్ ఆశాకిరణ్‌తో కలిసి ఆర్‌ఎంపీలు పీఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేశారు. పేరు ముందు డాక్టర్ అని పేరు పెట్టుకున్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. వారు రోగులకు ఇస్తున్న మందులను పరిశీలించారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సిన స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్స్‌లను గుర్తించామన్నారు. తురకపాలెంలో చనిపోయిన వారిలో చాలామంది ఈ ప్రథమ చికిత్స కేంద్రాలలో సెలైన్లు, యాంటీబయాటిక్స్ విచక్షణ రహితంగా వాడినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం అందరికీ అందుబాటులో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్వాలిఫైడ్‌వైద్యులు ఇతర పారామెడికల్ సిబ్బంది ఉండగా ప్రజలు నకిలీ వైద్యుల నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలకు వెళ్లడం ఎంత మాత్రం మంచిది కాదన్నారు. దీనివల్ల చిన్నచిన్న వ్యాధులే ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చేయకుండా అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిశోర్ మాట్లాడుతూ తురకపాలెం గ్రామ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. తొలిదశలోనే క్వాలిఫైడ్ వైద్యుల్ని సంప్రదిస్తే ఎలాంటి సమస్యలు రావన్నారు. ఐఎంఏ వైద్యులు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్‌తో పాటు తురకపాలెం సందర్శించిన వారిలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పూర్వ ఉపాధ్యక్షులు, ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ నాగేళ్ల కిశోర్, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి.సేవాకుమార్, ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ వై సుబ్బారాయుడు, ఉపాధ్యక్షులు డాక్టర్ డి. అమరలింగేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ బి. సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆటంకాలను అధిరోహించాలి

- ఇన్‌చార్జి వీసీ కె.గంగాధరరావు
- క్రీడాకారులకు క్యాష్ అవార్డుల ప్రదానం



పురస్కారం అందజేస్తున్న వీసీ

పెదకాకాని(ఏఎన్‌యు): క్రీడా స్ఫూర్తితో జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను అధిరోహించాలని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. వర్సిటీ పరిధిలో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు శుక్రవారం వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ అధ్యక్షత వహించారు.

నగదు పురస్కారాలు అందజేత

వర్సిటీ పరిధిలో 2024 –25 లో సౌత్ వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీల మహిళల వెయిట్ లిఫ్టింగ్ 76 కేజీల విభాగంలో బంగారు పతకం, ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన తెనాలి ఏఎస్ఎన్ కళాశాలకు చెందిన టి రేణుకకు రూ.40 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. 71 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన గుంటూరు మహిళా కళాశాలకు చెందిన బి. నానికి రూ.12,500, సౌత్ వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ 61 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన నిడుబ్రోలు పీబీఎన్ కళాశాలకు చెందిన డి. మౌలాలీకి రూ.32,500, సౌత్ వెస్ట్ జోన్ అంతర్ వర్సిటీ పురుషుల వెయిట్ లిఫ్టింగ్ 96 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన నగరంలోని ఎస్‌వీఆర్ఎం కళాశాల విద్యార్థి ఎ.అరుణ్ బాబుకు రూ.10,000 నగదు అందజేశారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక రేపు

చినగంజాం: బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్ అండర్ 14,16,18,20 విభాగాల్లో బాలబాలికలు ఎంపిక నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోగిరెడ్డి స్వామి రెడ్డి, కార్యదర్శి ఎం. వెంకట రెడ్డి తెలిపారు. ఖాజీపాలెంలోని కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కాలేజీ ఆవరణలోఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 8 గంటల్లోపు హాజరుకావాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 8247318995, 9542354041 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

కొల్లూరు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన కోటయ్య స్థానికంగా ఉన్న ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తూ, భార్యతో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 4న మద్యం తాగిన భర్త ఇంటికి ఆలస్యంగా వస్తానని ఫోన్‌లో తెలపడంతో మనస్తాపానికి గురైన భార్య వెంకటేశ్వరమ్మ ఇంటిలో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని పొన్నూరు మండలం ఇటుకంపాడులో ఉండే సోదరుడుకి ఈనెల 5 ఉదయం ఫోన్‌లో తెలపడంతో అతడు భర్తతో పాటు, మరో సోదరికి సమాచారం అందించాడు. అంతా కలసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వెంకటేశ్వరమ్మను తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఈనెల 10న గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కొల్లూరు పోలీసులు తెలిపారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి !

బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

బల్లికురవ: పెండింగ్ కేసులపై దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన పలు రికార్డులను పరిశీలించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల వారీగా రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి పెట్టాలని ఎస్‌ఐ వై. నాగరాజును ఆదేశించారు. శాంతిభద్రతలను నిత్యం పర్యవేక్షిస్తుండాలని చెప్పారు. గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా యజమానులను అప్రమత్తం చేయాలని తెలిపారు. క్వారీలో నిబంధనలు, భద్రతా చర్యలతో పాటు, బ్లాస్టింగ్ మెటీరియల్ నిల్వ చేసుకునేందుకు మ్యాగ్జైన్‌లు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. రవాణా కోసం అనుభవం లేని, హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వారిని నియమించుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సంతమాగులూరు సీఐ కె.వెంకటరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో బర్లీ పొగాకు సొమ్ము

మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న కరుణశ్రీ

జె.పంగులూరు: అద్దంకి నియోజక వర్గంలో ఇప్పటి వరకు 1,856 మంది రైతుల నుంచి 2,148 టన్నుల బర్లీ పొగాకు కొనుగోలు చేశామని మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. మండలంలోని బూదవాడలో శుక్రవారం ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 17 వేల టన్నుల పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఇప్పటి వరకు రూ. 127 కోట్లు ఇవ్వాలని, ఇప్పటికే రూ. 90 కోట్ల వరకు వారి ఖాతాలో జమయ్యాయని తెలిపారు. ఇంకా రూ. 37 కోట్లు మాత్రమే రావాల్సి ఉందని ఆమె తెలిపారు. పంగులూరు మండలంలో 782 మంది రైతుల వద్ద 990 టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. సోమవారం నుంచి పంగులూరు మండలానికి చెందిన రైతుల పొగాకును గుంటూరులో కొనుగోలు చేస్తామని, వారంతా అక్కడకు తీసుకురావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి డి.సుబ్బారెడ్డి, నరసింహారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడిన శతాబ్ది మర్రి చెట్టు


ఇంకొల్లులో విరిగిపడిన మర్రి చెట్టు భారీ కొమ్మలు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు- పావులూరు రోడ్డులో నాగులు చెరువు కట్టపై ఉన్న 100 సంవత్సరాల నాటి భారీ మర్రి చెట్టు కొమ్మలు శుక్రవారం హఠాత్తుగా విరిగి పడ్డాయి. అయితే, ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై చెట్టు కొమ్మలు విరిగి పడటంతో పూర్తిగా మూసుకుపోయింది. సాయంత్రం మూడు గంటల నుంచి ట్రాఫిక్ స్తంభించింది. సమాచారాన్ని అందుకున్న ఇంకొల్లు గ్రామ పంచాయతీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి అడ్డగడ వెంకటేశ్వర్లు చెట్టు కొమ్మలను తొలగింపజేసి జలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ఆందోళన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లకు వినతి పత్రాలు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జిల్లా అధ్యక్షుడు బసవ లింగారావు, నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయులు ఆందోళనలు కొనసాగించారు. నిరసన వారంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 60 మండలాల పరిధిలో తహసీల్దార్లకు మెమోరాండం సమర్పించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహమ్మద్ ఖాలీద్ తెలిపారు. ఆయా మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులతో కలిసి ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనల్లో బసవ లింగారావు, ఎండీ ఖాలీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక పరమైన డిమాండ్లను నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిల విడుదలకు రోడ్‌మ్యాప్ షెడ్యూల్ ప్రకటించాలని, లేని పక్షంలో ఈనెల 13,14వ తేదీల్లో ప్రజా ప్రతినిధులందరినీ కలిసి మెమోరాండంలను సమర్పిస్తామని తెలిపారు. నిరసన ప్రదర్శనల్లో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా జనార్దనరావు, పి.పార్వతి, సత్యనారాయణమూర్తి, కార్యదర్శి జి.దాస్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, నాయకులు గడ్డిపాటి శివరామకృష్ణ, బి.సాయిలక్ష్మీనారాయణ, సీహెచ్ లక్ష్మణ్‌కుమార్, చక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నెహ్రూనగర్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో శుక్రవారం మార్కెట్ సెంటర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు వలే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర గడిచినప్పటికీ రక్షణ చట్టం ఊసే లేదన్నారు. చట్టసభల్లో 33 శాతం, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మరో వాగ్దానం ఇచ్చినప్పటికీ ఇంతవరకు అతీగతి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు మూడు నెలల ముందే నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ చెబుతుంటే.. మరోపక్క ఇంతవరకు కులగణన చేపట్టకపోవడం చూస్తుంటే బీసీలను అన్యాయం చేయడమే అన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పారేపల్లి మహేష్, కోలా అశోక్, కొల్లూరు హనుమంతరావు, ముప్పన వెంకటేశ్వర్లు, తురక రమేష్, కోలా మణికంఠ, రామకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు


జిల్లా అధ్యక్షురాలు ఎం.ధనలక్ష్మి


జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారి

లక్ష్మీపురం: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) గుంటూరు జిల్లా 10వ మహాసభలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పలు తీర్మానాలు చేసినట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి రమణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం .ధనలక్ష్మి, ఏపీఎస్ కుమారి తెలిపారు. పాత గుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీలకు గత 42 రోజుల సమ్మె విరమణ సందర్భంగా చేసిన ఒప్పందంలో భాగంగా తక్షణమే జీతాలు పెంపుదల చేయాలని కోరారు. ధరల పెరుగుదల, కనీస వేతనాలను దృష్టిలో ఉంచుకొని రూ.26 వేలు జీతం ఇవ్వాలని తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆదాయ పరిమితి ఉన్నప్పటికీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు విడో పెన్షన్, తల్లికి వందనం, రేషన్ కార్డులు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడం తీవ్ర అన్యాయమని తెలిపారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

జిల్లా గౌరవాధ్యక్షులుగా జి. రమణ, అధ్యక్షులుగా ఎం.ధనలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి. ప్రేమలత, ప్రధాన కార్యదర్శిగా ఏపీఎస్ కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.శివపార్వతి, కోశాధికారిగా ఈ రత్నమంజుల, ఉపాధ్యక్షులుగా వి.విజయలక్ష్మి, రుక్మిణి, రజిని, టి పద్మావతి, ఓ రోజమ్మ కార్యదర్శులుగా కె ఎలిజబెత్, హేమలత, అస్మత్ తార, కే పద్మ, ఎస్ కే షాహిదా ఎన్నికయ్యారు. మరో 18 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో వైఎస్సార్‌సీపీ నేత శ్రీనునాయక్

వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లారెడ్డి గూడేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కేతావత్ శ్రీనునాయక్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీను నాయక్ గత కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన్ను వెల్దుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు బంధువులు తెలిపారు. శ్రీనునాయక్‌ను ఏ కేసుకు సంబంధించి విచారణకు తీసుకొచ్చారో తెలియలేదని బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచిస్తున్న ప్రభుత్వం

ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇబ్రహీం


సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం వంచిస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇబ్రహీం అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణ 'నిరసన వారం' రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏపీటీఎఫ్ సత్తెనపల్లి మండలశాఖ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించటం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందన్నారు. ఏపీ జేఏసీ నాయకుడు ఎస్. అంబేద్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కాల్వపల్లి శివారెడ్డి, అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్‌లు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ బాధ్యులు కె.ఉషారాణి, అక్తరున్నిసా, వంజ సునీల్‌కుమార్, భవనం సుబ్బారెడ్డి, లెనినారాణి, దామోదరం, రేపూడి చిన్నపిచ్చయ్య, ప్రభావతి, ధర్మారావు, నీలం చంద్రం, పి.మారుతిరమేష్, దాసరి రవికుమార్, షేక్ జిలాని, ఏపీ జేఏసీ సత్తెనపల్లి తాలూకా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు మొబైల్ వాహనం



నరసరావుపేట: అవగాహన కోసం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లాకు అందజేసిన మొబైల్ ఐఈసీ వాహనం ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో వాహనానికి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు వ్యాధిపై అవగాహన పెంచుతామన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వాహనాన్ని జిల్లాకు కేటాయించినందుకు సంస్థకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం మేనేజర్ జానీబాషా, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ రవి, పీపీటీసీటీ కౌన్సిలర్ జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.